మహిళలకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వం విఫలం

ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందుల సుబ్బలక్ష్మి

విశాలాంధ్ర - గొలుగొండ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలను గౌరవిస్తున్నామని చెప్తున్నా రక్షణ కల్పించడంలో విఫలమయ్యారని ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందుల సుబ్బలక్ష్మి అన్నారు. బుధవారం అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలం పాత కృష్ణ దేవి పేట గ్రామంలో ఆమె మాట్లాడారు. హక్కులతో సాధించుకున్న మహిళా చట్టాలను పటిష్టంగా అమలు చేయడం లేదని విమర్శించారు. మహిళలను కించపరుస్తున్నారని, వీటన్నింటికి కారణం మద్యపానమేనన్నారు. సీఎం జగన్ మద్యపానాన్ని నిషేధిస్తామని చెప్పినా ఆ హామీ నెరవేర్చలేదన్నారు. విచ్చలవిడిగా బెల్టు షాపులు, గంజాయి మత్తులో మూడు సంవత్సరాల పసికందు నుండి 60 సంవత్సరాలు వయసుగల మహిళలను కూడా వదలకుండా అత్యాచారాలకు పాల్పడుతున్నారన్నారు. అనంతరం అనేకమంది మహిళలు మహిళ సమస్యలో సభ్యత్వం పొందారు ఈ కార్యక్రమంలో మండల సిపిఐ పార్టీ కార్యదర్శి మేక భాస్కరరావు మహిళలు పాల్గొన్నారు

హక్కుల సాధన కోసం ఏఐటీయూసీని గెలిపించండి

జాతీయ ఉపాధ్యక్షులు ఆదినారాయణ

విశాలాంధ్ర - విశాఖ: ఈ నెల 31వ తేదీన జరగనున్న బీహెచ్ఈఎల్ ఉద్యోగుల గుర్తింపు యూనియన్ ఎన్నికల్లో బీహెచ్‌పీవీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) యునైటెడ్ ప్యానెల్‌ను గెలిపించాలని ఏఐటీయూసీ జాతీయ ఉపాధ్యక్షుడు డి.ఆదినారాయణ పిలుపునిచ్చారు. బీహెచ్‌పీవీ ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి పివిఎన్ రాజు అధ్యక్షతన కళాభారతి ఆడిటోరియంలో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం, కార్మిక చట్టాల అమలు కోసం, రానున్న రోజుల్లో మరిన్ని మెరుగైన సౌకర్యాల సాధన కోసం ఏఐటీయూసీ ప్యానల్ సింహం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న అనేక చట్టాలు భవిష్యత్తులో కనుమరుగవుతాయని అన్నారు. ఇటువంటి కీలక సమయంలో జరుగుతున్న ఎన్నికల్లో ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ, కార్మిక సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేసే ఏఐటీయూసీ ప్యానల్‌ను గెలిపించాలని కోరారు. గత అనేక సంవత్సరాలుగా గుర్తింపు యూనియన్ పేరుతో అమ్ముడుపోయిన ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ నాయకులు చేసిన తప్పుడు ఒప్పందాలను రద్దు చేసి, ఎనిమిది గంటల పని విధానం అమలు కోసం, సబ్సిడీల పునరుద్ధరణ కోసం, టౌన్ షిప్ మెయింటెనెన్స్ కోసం ఏఐటీయూసీ ప్యానల్‌కి ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ మాట్లాడుతూ కార్మిక ఉద్యోగుల హక్కులు పరిరక్షణ, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చారిత్రాత్మక పోరాటాలు చేసి వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన ఏఐటీయూసీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో హైదరాబాద్ బీహెచ్ఈఎల్ గుర్తింపు యూనియన్ అధ్యక్షులు ఎస్‌డివి కృష్ణంరాజు, బిహెచ్ ఇఎల్ యునైటెడ్ ఫ్రంట్ ప్యానెల్ నాయకులు శోభాకర్ సాహు, బొండా బాబురావు, కొల్లి దేవుడు, ఏ నర్సింగరావు, జె.రాము, వీరబాబు, భాష, ఏ.వెంకటరావు, ప్రశాంత్, టెక్కలి భాస్కరరావు, శ్యాం ప్రసాద్, ఎస్.గోవిందు, వారణాసి గోవిందు తదితరులు పాల్గొన్నారు.

డ్రాపౌట్ విద్యార్థులను పాఠశాలలో చేర్పించాలి

విశాలాంధ్ర - అనంతగిరి: శివలింగపురం ఆశ్రమ పాఠశాలను ఎంపీపీ శెట్టి నీలవేణి సందర్శించారు. ఆశ్రమ పాఠశాలలో ఉండి డ్రాపౌట్ అయిన విద్యార్థులను తిరిగి పాఠశాలల్లో చేర్పించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని సూచించారు. పాఠశాలలో 50 మందికి పైగా విద్యార్థులు డ్రాపౌట్స్ ఉన్నట్లు గుర్తించారు. వివిధ కారణాలతో విద్యార్థులు పాఠశాలకు దూరంగా ఉన్నారని వారిని తిరిగి పాఠశాలలో చేర్పించేందుకు ప్రయత్నిస్తున్నామని ప్రధానోపాధ్యాయులు శెట్టి రాంబాబు ఆమెకు వివరించారు. అనంతరం తుమ్మవలస గ్రామంలో ఎంపీ నిధులతో మంజూరైన బస్సు షెల్టర్ నిర్మాణానికి అనువైన స్థలాన్ని స్థానిక సర్పంచ్‌తో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యుడు షేక్ మదీనా తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ పాఠశాలకు ఆల్ రౌండ్ ఛాంపియన్‌షిప్ ట్రోఫీ

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఆల్ రౌండ్ ట్రోఫీ వచ్చింది. నవీన్, సునీత, శ్రావణి, హేమ దుర్గ క్రీడాకారులకు 87వ వార్డు వైసీపీ నాయకులు, ప్రధానోపాధ్యాయులు, పిటి మాస్టర్, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. గాజువాక ఉన్నత పాఠశాలలో జరిగిన త్రో బాల్, కబడ్డీ, రన్నింగ్‌లో ఉత్తమ ప్రతిభను కనబరిచి ట్రోఫీ అందుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రగడ వేణుబాబు, బొడ్డ గోవిందా, ముద్దపు దామోదర్, దుగ్గప్ప దానప్పలు, చిత్రడ వెంకటరమణ, బోండా గోవిందరాజులు, కోమటి రమాదేవి, పీటీ మాస్టారు మున్నాజి పాల్గొన్నారు.

తర్లువాడలో నేచురల్ ఫార్మింగ్ కూరగాయల మార్కెటింగ్ గొడౌన్

విశాలాంధ్ర - తగరపువలస: ఆనందపురం మండలం తర్లువాడ గ్రామంలో నూతనంగా నిర్మించిన నేచురల్ ఫార్మింగ్ కూరగాయల మార్కెటింగ్ గొడౌన్‌కు రైతులు నేరుగా కూరగాయలను తరలించాలని అవని ఆర్గానిక్ సంస్థ అధికారి బిందు పేర్కొన్నారు. పాలవలస గ్రామంలో బుధవారం ఆమె 10 మంది కూరగాయల రైతులను కలిశారు. రైతుల ఆర్గానిక్ పద్ధతులో పండించే కూరగాయలు, ఆకుకూరలను గతంలో ఎంవిపి కాలనీకి తరలించేవారని ప్రస్తుతం తర్లువాడలో ఉన్న గొడౌన్‌కు తరలించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎఫ్ఏ వనజ, చక్రవర్తి, ఐసిఆర్‌పిఎస్ పాల్గొన్నారు.

ఆర్ఓ వాటర్ ప్లాంట్ ప్రారంభం

విశాలాంధ్ర - మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతం పరిధి మల్కాపురం పోలీస్ స్టేషన్‌లో ఆర్ఓ వాటర్ ప్లాంట్‌ను బుధవారం డీజీపీ, హెచ్‌పీసీఎల్ అధికారులు ప్రారంభించారు. మల్కాపురం పోలీస్ స్టేషన్‌లో సీఎస్సార్ నిధుల్లో భాగంగా సుమారుగా ఏడు లక్షలు వ్యయంతో 1000 లీటర్ల సామర్థ్యం గల వాటర్ ప్లాంట్‌ను అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులతో పాటు సీపీ దేవుడు బాబు, హెచ్‌పీసీఎల్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

4న వైస్ ఎంపీపీ ఎన్నిక

విశాలాంధ్ర - యస్.రాయవరం: సెప్టెంబర్ 4వ తేదీన ఎస్.రాయవరం మండల పరిషత్ వైస్ ఎంపీపీ ఎన్నికకు సంబంధించి నోటిఫికేషన్ విడుదలైనట్లు ఎంపీడీవో రామచంద్రమూర్తి తెలిపారు. గతంలో వైస్ ఎంపీపీగా ఉన్న కోన లోవ లక్ష్మి ఎంపీపీగా ఎంపిక కావడంతో తన పదవికి రాజీనామా చేయడంతో ఆ పదవి ఖాళీ అయిందని, ఎన్నికల కమిషన్ ఆ పదవిని భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు వెల్లడించారు. నాలుగో తేదీన ఉదయం 11 గంటలకు ఎన్నికల అధికారి సమక్షంలో ఎన్నిక నిర్వహిస్తారని తెలిపారు.



డిఫెన్స్ న్యాయవాది సలీంను కలిసిన విదసం నేతలు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: కోడి కత్తి కేసులో నిందితుడు జన పల్లి శ్రీనివాసరావు తరఫున ఎన్ఐఏ కోర్టులో వాదిస్తున్న న్యాయవాది సలీంను వారి కార్యాలయంలో వి ద సం ఐక్యవేదిక నాయకులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. సంచలనం సృష్టించిన కేసులో సంచలన నిజాలు వెల్లడించి ఉచితంగా న్యాయ సహాయం అందిస్తున్నందుకు లాయర్ సలీంకు దళిత సంఘాల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. విదసం ఐక్యవేదిక కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు మాట్లాడుతూ భారీ మొత్తంలో ఫీజు తీసుకోదగిన ఎన్ఐఏ కేసును ఉచితంగా వాదించడానికి సలీం ముందుకు రావడం నిందితుడు కుటుంబానికి ఎంతో ఊరట కలిగించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ వేమన, సోడా దాసి సుధాకర్, కోల హరీబాబు, డి.నిర్మల, కుంచే మధు, కస్తూరి వెంకట రావు, జిసిహెచ్ అప్పల రాజు, తొత్తరమూడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యలో నైపుణ్యం, ఆధునిక సాంకేతికత భాగం చేయాలి

విశాలాంధ్ర - విశాఖ సిటీ: విద్యలో నైపుణ్యాలను అంతర్భాగం చేసే విధంగా సిలబస్ రూపకల్పన జరగాలని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి అన్నారు. వార్షిక బీఓఎస్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆధునిక టెక్నాలజీ ఆవిష్కరణలను, మార్పులను మన రాష్ట్ర యువతకు చేరువ చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి కోరకుంటున్నారన్నారు. ఈ దిశగా పనిచేస్తూ అన్ని కోర్సులను ఐటి సబ్జెక్టులను మిళితం చేస్తూ పనిచేయడం, డేటా సైన్స్, ఎంఐ వంటివి నేటి తరానికి అందించాలన్నారు. తద్వారా ఈ రంగాలలో వీరు భవిష్యత్తులో నిష్ణాతులుగా మారడానికి ఆరంభంలోనే శ్రీకారం చుట్టాలన్నారు. ఇకపై ప్రతీ సెమిస్టర్ ఆరంభంలో సిలబస్ మార్పులపై చర్చించే విధంగా ఏడాదిలో రెండు పర్యాయాలు సమావేశం కావాలని సూచించారు.

ఇచ్చిన బాధ్యతను పూర్తిస్థాయిలో నిర్వర్తిస్తాం

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: పార్టీకి విధేయతగా ఉంటూ ఇచ్చిన బాధ్యతను నిర్వర్తిస్తూ, పనిని పూర్తిస్థాయిలో న్యాయం చేస్తామని యువ నాయకులు, సుంకరమెట్ట సత్యనారాయణ స్వామి దేవస్థానం చైర్మన్ కర్రి మహాలక్ష్మి నాయుడు (కెఎం. నాయుడు), సత్యదేవ్ హాస్పిటల్ అధినేత బొడ్డేడ లక్ష్మీ నరసింహారావు తెలిపారు. మంత్రి గుడివాడ అమర్నాథ్, అనకాపల్లి జిల్లా పార్టీ అధ్యక్షులు ప్రసాద్‌లతో కలిసి విజయవాడలో ఉత్తరాంధ్ర జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డిని కలిసి శ్రీ నూకాంబిక అమ్మవారి భారీ చిత్రపటాన్ని ఇచ్చి సత్కరించారు. రాబోయే ఎన్నికల్లో కచ్చితంగా వైసీపీదే విజయమన్నారు. అనకాపల్లిలో మారుతున్న రాజకీయ పరిణామాలతో పాటు బొడ్డేడ ప్రసాద్ నేతృత్వంలో, మంత్రి అమర్నాథ్ నాయకత్వంలో పార్టీలోకి రావడానికి యువత మక్కువ చూపుతున్నారని అన్నారు. వైసీపీ చేపట్టిన ప్రతీ కార్యక్రమాన్ని మరొకసారి ప్రజలకి అర్థమయ్యేలా చేస్తామని, ప్రతిపక్షాల కుట్రపూరిత ప్రచారాలను తిప్పికొడతామని అన్నారు. ఈ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని మరే ప్రభుత్వం చేయలేదని, పార్టీలో ప్రతి కార్యకర్త వైసీపీ విజయాన్నే విశ్వసిస్తున్నారని, వైసీపీ కార్యకర్తలను నిందిస్తున్న ప్రతిపక్షాల ప్రచారాలను తిప్పికొట్టేలా తాము భుజంపై బాధ్యతలు వేసుకుంటామని చెప్పారు. ప్రజలకు మరింత చేరువయ్యే కార్యక్రమాలు చేపడతామని కెఎం నాయుడు, డాక్టర్ లక్ష్మీనరసింహారావు తెలిపారు.

మందుబాబులకు జరిమానా

విశాలాంధ్ర - భీమిలి: ఆనందపురం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న వివిధ కూడళ్లలో మద్యం త్రాగి పట్టుబడ్డ మందుబాబులకు ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల జరిమానాలతో పాటు మద్యం త్రాగి వాహనాలు నడిపే వ్యక్తులకు చైతన్యం కోసం కమ్యూనిటీ సర్వీస్ శిక్షగా భీమిలి 15వ అడిషనల్ మెట్రో పాలిటన్ మెజిస్ట్రేట్ జి.విజయలక్ష్మి శిక్ష విధించారు. ఆనందపురం పరిధిలో మొత్తంగా 37 వేల రూపాయలు మందుబాబుల నుంచి ఫైన్, అలాగే కమ్యూనిటీ సర్వీస్‌లో భాగంగా సెయింట్ ఆన్స్ స్కూల్ భీమిలి పరిసరాల ఆవరణలో పచ్చదనం పరిశుభ్రం పలు కార్యక్రమాలు మందు బాబులతో చేయించారు.

శారద ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర - ముంచింగిపుట్టు: మండల కేంద్రంలో గల శారద నికేతన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల ఆవరణలో శారద ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శారద ట్రస్ట్ బోర్డు మెంబర్ రోజా, శారద ట్రస్టు గౌరవ సభ్యులు గిరిజన మహిళా సంఘం ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ప్రభావతిలు ప్రారంభించారు. ఈ వైద్య శిబిరానికి విశాఖపట్నంకు చెందిన వైద్య నిపుణులు బృందం అన్వేష్, ప్రేమచంద్, రవితేజ్, పద్మ లలిత ఆధ్వరంలో 205 మంది గిరిజన ప్రజలకు వైద్య సేవలు అందించారు. పలువురు బీపీ, షుగర్, పక్షవాతం, కీళ్లు, నడుము, కండరాల నొప్పులు వంటి రోగాలతో బాధపడుతున్నట్లు గుర్తించి వైద్య సేవలు అందించి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

డా. గుణకు జాతీయ మత్స్యకార సంఘం సత్కారం

విశాలాంధ్ర - నక్కపల్లి: చేపలపై పరిశోధనలో మండలంలోని రాజయ్యపేటకు చెందిన మత్స్యకార మహిళకు మైలపల్లి గురమ్మ (గుణ) డాక్టరేటు లభించింది. ప్రస్తుతం పాయకరావుపేట ప్రభుత్వ కళాశాలలో ఒప్పంద పద్ధతిలో జువాలజీ అధ్యాపకురాలిగా పనిచేస్తున్నారు. సముద్రంలో లభించే కానకడత చేపల ప్రత్యుత్పత్తి వ్యవస్థపై గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో పరిశోధన చేసి నివేదిక సమర్పించడంతో ఆమెకు డాక్టరేట్ వచ్చింది. విశ్వవిద్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమెకు పట్టా ప్రదానం చేశారు. గుణకు జాతీయ మత్స్యకార సంఘం జిల్లా సభ్యులు దుశ్శాలువాతో దంపతులు గుణ, ప్రకాష్ కుమార్ ఇరువురిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో జాతీయ మత్స్యకార సంఘ రాష్ట్ర అధ్యక్షులు మోసా అప్పలరాజు, అనకాపల్లి జిల్లా అధ్యక్షులు కోవిరి వెంకటేష్, పాయకరావుపేట నియోజకవర్గ కన్వీనర్ పిక్కి కొదండరావు, సిరిపల్లి అప్పలరాజు, మండల అధ్యక్షులు వాసుపల్లి శివ, వంకా కాశీరావు పాల్గొన్నారు.

రూ.16 కోట్లతో రోడ్ల నిర్మాణ పనులు

మంత్రి గుడివాడ అమర్నాథ్

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: రహదారుల విస్తరణ, నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభమై, దసరా నాటికి పూర్తవుతాయని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ వెల్లడించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలో ప్రధాన రహదారుల సుందరీకరణకు రాష్ట్ర ప్రభుత్వం సుమారు 16 కోట్ల రూపాయలు మంజూరు చేసిందని చెప్పారు. పట్టణంలోని సుంకరమెట్ట జంక్షన్ నుంచి శారదా నది బ్రిడ్జి వరకు, అలాగే నెహ్రూ చౌక్ జంక్షన్ నుంచి గుండాల జంక్షన్ వరకు, రింగ్ రోడ్ నుంచి అండర్ బ్రిడ్జి వరకు, అలాగే రైల్వే స్టేషన్ నుంచి కోట్ని వీధి వరకు రహదారులను పునరుద్ధరిస్తున్నట్లు వెల్లడించారు. కాగా విలీన ప్రాంతాల్లో కలిసిన రాజుపాలెం, వల్లూరు, ఎరుకువానిపాలెం ప్రాంతాలకు సంబంధించి సూర్యనారాయణ స్వామి దేవాలయానికి వెళ్లే ప్రధాన రహదారిని నాలుగు కిలోమీటర్ల మేర రెండున్నర కోట్ల రూపాయలతో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. కొత్తూరులో ఎర్ర చెరువును ప్రముఖ ఫార్మ కంపెనీ లారస్ సంస్థ సహకారంతో మూడు కోట్ల రూపాయల వ్యయంతో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. పలు రహదారులకు సెంటర్ లైటింగ్ ఏర్పాటు చేసి అనకాపల్లి పట్టణానికి ప్రత్యేక గుర్తింపు తీసుకువస్తామని చెప్పారు. ఈ విలేకరుల సమావేశంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, ఆంధ్రప్రదేశ్ ఇన్ల్యాండ్ వాటర్ వేస్ చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్, అనకాపల్లి పట్టణ పార్టీ అధ్యక్షుడు జానకి రామరాజు, తదితరులు పాల్గొన్నారు.

దస్తావేజు లేఖరుల పెన్‌డౌన్

విశాలాంధ్ర - నక్కపల్లి: మండలంలో ఏపీ రాష్ట్ర దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘం పిలుపుమేరకు పెన్‌డౌన్ కార్యక్రమం చేపట్టారు. నక్కపల్లి సబ్ రిజిస్ట్రారు వారి కార్యాలయం వద్ద దస్తావేజు లేఖరులు ఎటువంటి దస్తావేజులు వ్రాయకుండా నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. ఈ సమ్మెకు టీడీపీ, సిపిఎం పార్టీలు సంఘీభావం తెలిపాయి. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, టీడీపీ మాజీ వైస్ ఎంపీపీ వైబోయిన రమణలు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది దస్తావేజు లేఖరులు, సహాయకులు, డీటీపీ ఆపరేటర్లు సబ్ రిజిస్ట్రారు కార్యాలయం వద్ద దస్తావేజులు వ్రాస్తు జీవనోపాధి సాగిస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన సాఫ్టవేర్ కార్డు ప్రైమ్ 2.0 వల్ల దస్తావేజు లేఖర్లు వీధినపడే అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ దస్తావేజు లేఖరి దాతారం మురళీకృష్ణ, యన్.వి.రమణ, కొంగర రాంబాబు, పి.లోవరత్నం, కె.సూర్యనారాయణ, జి.నూకరాజు, ముద్దా బాబ్జీ, బి.రాజు, వెలగా లోకేష్, కుమార్, పి.రమేష్, కుమార్, సాయి, శ్రీను, ఉపేంద్ర, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురం: రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయాల వల్ల డాక్యుమెంట్ రైటర్ల కుటుంబాలు రోడ్డున పడతాయని మండల డాక్యుమెంట్ రైటర్ల సంక్షేమ సంఘం అధ్యక్షులు ఏనుగులు సత్యారావు పేర్కొన్నారు. డాక్యుమెంటు రైటర్లు సబ్ రిజిస్టర్ కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. నూతన విధానం ప్రైమ్ 2 ద్వారా డాక్యుమెంట్ రైటర్లు ఉపాధి కోల్పోయే అవకాశం ఉందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు మూడు లక్షల మంది దస్తా లేఖరులు పనులు నిర్వహించి జీవనోపాధి పొందుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొస్తున్న ప్రైమ్ 2 విధానం ద్వారా దస్తా లేఖర్ల జీవనోపాధికి గండిపడుతుందన్నారు. దీనిని నిరసిస్తూ గురువారం కూడా నిరసన చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్యుమెంట్ రైటర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

విశాలాంధ్ర - పాయకరావుపేట: ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని టీడీపీ మండల అధ్యక్షులు పెదిరెడ్డి చిట్టిబాబు అన్నారు. పార్టీ మండల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ప్రకటించిన మేనిఫెస్టో, భవిష్యత్తుకు గ్యారెంటీ, బాబు షూరిటీ కార్యక్రమాల గురించి ప్రజలందరికీ తెలిసే విధంగా విస్తృతస్థాయిలో సెప్టెంబర్ 1 వ తేదీ నుంచి గ్రామాల్లో ప్రచారం చేయాలని తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ పట్టణ అధ్యక్షులు పెదిరెడ్డి శ్రీను, యాళ్ల వరహాల బాబు, బొంది కాశీ విశ్వనాథ్, కీర్తి సీతారాం, దేవవరపు వెంకట్రావు, వల్లా విలియం కేరి, చించలపు ప్రదీప్, పెదిరెడ్డి నాగ వెంకటరమణ, జూరెడ్డి ప్రసాద్, కురందాసు శివ, మలిపెద్ది వెంకట రమణ, గుల్లా నాగరాజు, వేములపూడి అప్పారావు, విన్నింటి సూరిబాబు, వంకా శివ తదితరులు పాల్గొన్నారు.

టూరిజం ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఏకగ్రీవ ఎన్నిక

విశాలాంధ్ర - అరకులోయ: అల్లూరి జిల్లా పరిధిలో ఏపీ టూరిజంలో పలు యూనిట్లలో పనిచేస్తున్న టూరిజం కాంట్రాక్ట్, మెన్ పవర్, డైలీ వేజ్, ఎంప్లాయిస్ వర్కర్స్ కార్మికులు యూనియన్ నూతన కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగినట్లు టూరిజం కార్మిక రాష్ట్ర యూనియన్ నాయకులు వంతల బాబురావు తెలిపారు. గౌరవ అధ్యక్షులుగా వి. ఉమామహేశ్వరరావు (సిఐటీయు), అధ్యక్షులుగా ఆర్.వి.నరసింహ, బొర్రా యూనిట్ నుండి ఉపాధ్యక్షులుగా ఏ.సంజీవరావు అరకు యాత్రనివాస్, జి.గురు తైడా జంగిల్ బిల్స్ యూనిట్, ప్రధాన కార్యదర్శి వి.అంజలిరావు మయూరి సహాయ కార్యదర్శులుగా బుధురాజు, అనంతగిరి జె. సురేష్ కుమార్ మయూరి, కోశాధికారిగా డి.సన్యాసమ్మ అనంతగిరి, జి ధర్మా మయూరిలను ఎన్నుకున్నారు. మెంబర్లుగా జి.మహేష్ మయూరి, డి.కృప మయూరి, బి.శాంతి కుమారి యాత్రనివాస్, ఎల్.చిరంజీవి యాత్రనివాస్, జి.స్వామి యాత్రనివాస్, టి.నాగేష్ బొర్రా, కె.సదాశివ మయూరి, సిహెచ్ క్రిష్ణ లంబసింగ్, జె.సింహాద్రి బొర్రా, వైజి లింగేశ్ తైడా, జి.లక్ష్మణ్ తైడా, డి.విజయ్ కుమార్ అనంతగిరి, రఘు లంబసింగ్, రామరావు అనంతగిరి, పి.ఆనంద్ మయూరిలు ఎన్నికయ్యారు.

జీవీఎంసీ ఆర్థిక సలహాదారు మల్లికాంబకు సేవారత్న అవార్డు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ఎవరు ఏమైపోతే మనకేం మనం బాగుండాలి అనే మనస్తత్వం ఉన్న ఈ రోజులలో పేదవాడికి అన్నం పెడుతూ వారి సేవలో నిరంతరం తరిస్తున్న కల్పవృక్షం మహా విశాఖపట్నం ఆర్థిక సలహాదారాలు మల్లికాంబ. నాటి మదర్ థెరిసాను గుర్తు చేసే విధంగా పేదలకు అన్న వస్త్రాలతో పాటు ఆరోగ్యంపై దృష్టి సారించి అటువంటి వారిని అక్కున చేర్చుకున్న మహిళ మల్లికాంబ. విధి నిర్వహణలో ఆమెకి ప్రతి ఏటా ఎన్నో అవార్డులు వస్తున్నా, తన ఇంటిని చక్కదిద్దడంతోపాటు జీవితంలో ఏదో ఒక మంచి పని చేయాలి అనే సంకల్పంతో పదిమంది జీవితాలలో వెలుగు నింపాలి ఆకలితో ఏ ఒక్కరూ చనిపోకూడదు అన్న ఆలోచనతో తనకు తోచిన విధంగా నిరంతరం పేదలకు సేవలు చేస్తున్నారు. అందుకే ఆమెను అవార్డులు వెతుక్కుంటూ వస్తున్నాయి. సాంస్కృతిక, సేవ, మానవతా దృక్పథంలో ఆమె చూపుతున్న విశేష ప్రతిభకు సికింద్రాబాద్‌లో ఉన్న న్యూ లైఫ్ థీయోలాజికల్ యూనివర్సిటీ వారు 2023 గాను సేవ రత్న బిరుదుతో ఆగస్టు 26వ తేదీన బహూకరించి సత్కరించారు.

వాలీబాల్ కిట్ అందజేత

విశాలాంధ్ర - కె.కోటపాడు: గ్రామాల్లో యువకులను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో వాలీబాల్ క్రికెట్ తదితర క్రీడా పరికరాలను అందిస్తున్నట్లు మండల జనసేన నాయకులు కుంచ అంజిబాబు తెలిపారు. బుధవారం చౌడువాడ పంచాయతీలో సీనియర్ జనసేన నాయకులు మారపురెడ్డి శివ, నాగులపల్లి మల్లు నాయుడు, గంగుమళ్ల భీమేష్ చేతుల మీదుగా యువకులకు వాలీబాల్ కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో చినరాయుడు, సాయి, మురళి, సతీష్, పవన్, ప్రకాష్, సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు భంగం కలిగించేలా టీడీపీ వ్యాఖ్యలు

విశాలాంధ్ర - డుంబ్రిగూడ: యువ గళం పాదయాత్రలో టీడీపీ నాయకులు చంద్రబాబు నాయుడు, నారా లోకేష్, కింజరాపు అచ్చెన్నాయుడుల వ్యాఖ్యలు శాంతిభద్రతలకు భంగం కలిగించేలా ఉన్నాయని అరుకు నియోజకవర్గం సోషల్ మీడియా కన్వీనర్ పాంగి నర్సింగ్‌రావు చెప్పారు. టీడీపీ నాయకులపై చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల కార్యదర్శి ఎం.వినోద్, మండల సోషల్ మీడియా కన్వీనర్ వంతల మోహన్, లవకుశ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న ఐపీఎస్ అధికారులు

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరహా లక్ష్మీనృసింహ స్వామి వారిని హైదరాబాద్ సి.బి.ఐ జాయింట్ డైరెక్టర్ ఎస్.వేణుగోపాల్, ఐపీఎస్ మురళి, రంభలు దర్శించుకున్నారు. వీరికి ఆలయ డీఈఓ, జిల్లా దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ సుజాత, పర్యవేక్షకులు త్రిమూర్తులు పూలమాలలు వేసి ఘనస్వాగతం పలికారు. అనంతరం వేద పండితులచే వేద ఆశీర్వచనం పలికారు. వారిని స్వామి వారి శేష వస్త్రంతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

మెరుగైన ఆరోగ్యంపై జిమ్సర్‌లో సదస్సు

విశాలాంధ్ర - మధురవాడ: ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించిన స్థిరమైన అభివృద్ధికి తోడ్పడే మెరుగైన ఆరోగ్య కార్యక్రమాలపై గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (జిమ్సర్) ఆసుపత్రి సామాజిక వైద్య విభాగం ఆధ్వర్యంలో సెప్టెంబర్ 2, 3 తేదీలలో ప్రత్యేక సదస్సు నిర్వహిస్తున్నట్లు నిర్వాహక కార్యదర్శి డాక్టర్ ఎస్.జి.నాగమణి తెలిపారు. ఇండియన్ పబ్లిక్ హెల్త్ అసోసియేషన్, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ప్రివెంటివ్ అండ్ సోషల్ మెడిసిన్ సంయుక్తంగా గీతం వేదికగా ఈ సదస్సును నిర్వహిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ సదస్సులో బాలల ఆరోగ్యం, కౌమార్య ఆరోగ్యం, పోషకాహారం, మానసిక ఆరోగ్యం, పర్యావరణం, గిరిజన ఆరోగ్యం, వివిధ ఆరోగ్య పథకాల ఆవిర్భావంపై నిపుణులు ప్రసంగిస్తారన్నారు.

హిందూ దేవాలయాలలో అన్యమతస్తులను తొలగించాలి

విశాలాంధ్ర - వి.మాడుగుల: హిందూ దేవాలయాలలో అన్యమతస్తులను తొలగించాలని మండల కేంద్రమైన మాడుగులలో దేవి ఆడిటోరియంలో బుధవారం బిజెపి, విశ్వహిందూ పరిషత్ తదితర సంస్థల ఆధ్వర్యంలో సంతకాల సేకరణ ఉద్యమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తిరుమల తిరుపతి పుణ్యక్షేత్రం వంటి అన్ని యాత్ర స్థలాలలో దేవస్థానాలలో ఉద్యోగులుగా అన్ని ఇతర మతస్తులు వ్యవహరిస్తున్నారని, వీరిని వెంటనే తొలగించి హిందూ దేవాలయాల్లో హిందువులకే ఉద్యోగాలు, నిర్వహణ బాధ్యతలు అప్పగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ విశ్వహిందూ పరిషత్ నాయకులు పుట్టా గంగయ్య, దంగేటి సూర్యారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు మండల సంతోష్ సుబ్బలక్ష్మి, మండల సతీష్, గౌరీపట్టపు జగన్నాధరావు తదితరులు పాల్గొన్నారు.



విశాలాంధ్ర
➡ విశాఖపట్నం
➡ అనకాపల్లి
➡ అల్లూరి సీతారామరాజు

వ్యవసాయ రంగానికి పెద్ద పీట

విశాలాంధ్ర - చింతపల్లి: గిరిజనుల అభ్యున్నతికి, ఆర్థికాభివృద్ధికి వైసీపీ ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తుందని స్థానిక సర్పంచ్ దురియా పుష్పలత అన్నారు. పంచాయతీ పరిధిలోని సచివాలయం-1, సచివాలయం-2, సచివాలయం-3 రైతు భరోసా కేంద్రాల పరిధిలోని గిరి రైతులకు 90 శాతం రాయితీపై 5.5 టన్నులు రాజ్మా చిక్కుళ్ళను లబ్ధిదారులకు ఆమె అందజేసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజనుల అభ్యున్నతికి, వారు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు వైకాపా ప్రభుత్వం నిరంతరం పాటుపడుతుందన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దని, వ్యవసాయ రంగానికి వైకాపా ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలను గిరిజన రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో సచివాలయం అగ్రికల్చర్ అసిస్టెంట్ చంద్రకళ, చేతన్ వర్మ, వాలంటీర్ వి.పరమేశ్వరరావు, నీలేసు, రాజు గ్రామస్తులు పాల్గొన్నారు.

లైఫ్ లైన్ ఆసుపత్రిలో ఉచిత ఓపీ

విశాలాంధ్ర - గొలుగొండ: అనకాపల్లి జిల్లా నర్సీపట్నం కేంద్రంగా ఉన్న లైఫ్ లైన్ ఆసుపత్రిలో ప్రతీ బుధవారం దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ఉచితంగా ఓపీ నిర్వహించడం జరుగుతుందని డాక్టర్ లాలం వంశీకృష్ణ తెలిపారు. ప్రజలు పలు వ్యాధుల బారినపడి వాటిని నయం చేసుకునే క్రమంలో దీర్ఘకాలిక రోగులుగా మారుతున్నారన్నారు. అటువంటి వారికోసం ప్రతి బుధవారం తమ లైఫ్ లైన్ ఆసుపత్రిలో ఉచితంగా పరీక్షించడం జరుగుతుందన్నారు. బీపీ, షుగర్, థైరాయిడ్, ఆయాసం, పక్షవాతం, ఫిట్స్, కీళ్లు, కిడ్నీ, కాలేయ సమస్యలు, మలేరియా, డెంగ్యూ, వంటి వ్యాధులకు చికిత్స అందించడం జరుగుతుందన్నారు.

అన్నా చెల్లెళ్ల అనుబంధం రాఖీ పౌర్ణమి

విశాలాంధ్ర - గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ బ్రహ్మకుమారి జ్యోతి బెహరా చేతికి రాఖీ కట్టి రాఖి పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. అన్నా చెల్లెలు అనుబంధం రాఖీ పౌర్ణమి సందర్భంగా విరాట్ నగర్ బ్రహ్మకుమారి ఆశ్రమం ఇన్చార్జ్ బికే జ్యోతి బుధవారం జీవీఎంసీ కోఆప్షన్ సభ్యులు బెహరా భాస్కరరావు స్వగృహంలో ఆయనకు రాఖీ కట్టడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ తన దగ్గరకు వచ్చిన ప్రతి ఒక్కరికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వనాథ్, లక్ష్మి పాల్గొన్నారు.

యువత కష్టించి పని చేయాలి

విశాలాంధ్ర - గొలుగొండ: 2024లో జరిగే ఎన్నికల్లో నర్సీపట్నం నియోజకవర్గం నుండి పోటీ చేసే చింతకాయల అయ్యన్నపాత్రుడును అఖండ మెజార్టీతో గెలిపించేందుకు యువత కష్టించి పని చేయాలని నర్సీపట్నం నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షుడు నర్సీపట్నం 25వ కౌన్సిలర్ చింతకాయల రాజేష్ తెలిపారు. బుధవారం గొలుగొండ మండలం మేజర్ పంచాయతీ ఏఎల్ పురం గ్రామంలో గల అల్లూరి సీతారామరాజు నందనవనంలో మాజీ జెడ్పీటీసీ చిటికెల తారక వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. యువతకు ఏ సమస్య వచ్చినా తనకు తెలియజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, యువత పాల్గొన్నారు.

వైయస్సార్ బీమా అందజేత

విశాలాంధ్ర - మాకవరపాలెం: ఈ నెల 7న కరెంట్ షాక్‌కు గురై మృతి చెందిన తామరం గ్రామానికి చెందిన మనబాల గంగబాబు కుటుంబానికి బుధవారం వైయస్సార్ బీమా తక్షణ సాయం అందజేశారు. వైయస్సార్ బీమా కింద మంజూరైన 5లక్షల రూపాయల్లో ముందుగా రూ. 10వేలు దహన సంస్కారాల నిమిత్తం గంగబాబు భార్య మంగకు వైస్ ఎంపీపీ లక్ష్మీ చేతుల మీదుగా బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మిగిలిన రూ. 4లక్షల 90 వేలను అకౌంట్‌లో జమ చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు హరిబాబు, సచివాలయ కన్వీనర్ శ్రీధర్, ఉప సర్పంచ్ ప్రసాద్, వైసిపి గ్రామ కమిటీ అధ్యక్షులు నారాయణరావు పాల్గొన్నారు.

ఘనంగా సుకుమార్ వర్మ పుట్టినరోజు వేడుకలు

విశాలాంధ్ర - మునగపాక: స్థానిక వైసీపీ కార్యాలయంలో బుధవారం మాజీ డీసీసీబీ చైర్మన్ సుకుమార్ వర్మ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అనకాపల్లి జిల్లా వైసీపీ అధ్యక్షులు ప్రసాద్ విచ్చేశారు. అభిమానులు ప్రసాద్ చేతుల మీదుగా కేకును కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని భగవంతుని కోరుతున్నానన్నారు. రాబోయే రోజుల్లో సుకుమార్ వర్మ మంచి పదవులను ఆకర్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సోమ సత్యనారాయణ, ఎంపీటీసీ రాము, సర్పంచులు, అభిమానులు పాల్గొన్నారు.

రాయితీపై రాజ్మా విత్తనాలు పంపిణీ

విశాలాంధ్ర - దుంబ్రిగూడ: మండలంలోని సొవ్వ పంచాయితీ దేవుదువలస గ్రామంలోని బుధవారం పంచాయతీ సర్పంచ్ పి.సోయిత గిరిజన వ్యవసాయ రైతులకు 3000 కిలోల రాయితీపై రాజ్మా విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గిరిజన వ్యవసాయ రైతులకు రాయితీపై పంపిణీ చేసిన రాజ్మా విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ ఫీల్డ్ అసిస్టెంట్ రాములమ్మ, వైసీపీ నాయకులు గురునాయుడు, అశోక్ ప్రసాద్, వాలంటీర్లు, వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాలను కలెక్టర్ తనిఖీ

విశాలాంధ్ర - చీడికాడ: మండలంలోని జి.కొత్తపల్లి కస్తూర్బా పాఠశాలను జిల్లా కలెక్టర్ రవి పటాన్ శెట్టి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను తనిఖీ చేసి లైబ్రరీని పరిశీలించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. కోణం భూ సమస్యలను తహశీల్దార్ రాణిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో వెంకటలక్ష్మి, ఎంపీడీవో జయప్రకాశరావు, డిపిఆర్సి జిల్లా కోఆర్డినేటర్ నాగలక్ష్మి, ఈ ఓ పి ఆర్ డి కామేశ్వరరావు, ఎంఈఓ బివి రమణ, పంచాయితీ కార్యదర్శులు గోపి, సన్యాసిరావు, ఇతర శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

కొత్తపాలెం కోపరేటివ్ బ్యాంక్ చైర్మెన్ ఆళ్లకు శుభాకాంక్షలు

విశాలాంధ్ర - పెందుర్తి: జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెం కోపరేటివ్ బ్యాంకు చైర్మన్ గా బాధ్యతలు చేపట్టిన వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, గోపాలపట్నం హైస్కూల్ అభివృద్ధి కమిటీ చైర్మన్ ఆళ్ల పైడిరాజుకు పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు. శ్రీ వరహాలక్ష్మి నరసింహస్వామి టు వీలర్ బైక్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు పైడిరాజును కలిసి అభినందనలు తెలియజేశారు. అనంతరం పైడిరాజు మహిళలకు రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేశారు.

గ్లోబల్ ఫిన్‌టెక్, సైబర్ సెక్యూరిటీ కౌన్సిల్‌లలో కేఎల్‌కు సభ్యత్వాలు

విశాలాంధ్ర - విశాఖ సిటీ: భారతదేశంలోని ప్రముఖ విశ్వవిద్యాలయం అయిన కెఎల్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ, దాని ఎంబీఏ ఫిన్‌టెక్ ప్రోగ్రామ్‌కు ఫిన్‌టెక్ కౌన్సిల్, సైబర్ క్రైమ్ ఇంటర్నేషనల్ ఇన్వెస్టిగేషన్ కౌన్సిల్ రెండింటిలోనూ తాత్కాలిక సభ్యత్వం పొందినట్లు వెల్లడించింది. ఈ ప్రతిష్ఠాత్మక గుర్తింపు ఆర్థిక సాంకేతికత మరియు సైబర్ సెక్యూరిటీ రంగాలలో ఆవిష్కరణ, సహకారం శ్రేష్ఠతను పెంపొందించడంలో విశ్వవిద్యాలయం యొక్క నిబద్ధతను నొక్కి చెబుతుందని కెఎల్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ జి. పార్థ సారధి వర్మ అన్నారు.

మర్యాదపూర్వక కలయిక

విశాలాంధ్ర - మునగపాక: మునగపాక మండల జర్నలిస్టు ఫోరం నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేసిన సందర్భంగా అనకాపల్లి జిల్లా వైసీపీ అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్‌ను మునగపాక వైసీపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ప్రతిరోజు శ్రమించే జర్నలిస్టులకు వైసీపీ అండగా ఉంటుందని అన్నారు. నూతనంగా ఏర్పడిన కార్యవర్గాన్ని అభినందించారు. అనంతరం ఆయనకు శాలువా కప్పి కార్యవర్గం సన్మానించారు. ఈ కార్యక్రమంలో మునగపాక జర్నలిస్ట్ ఫోరం అధ్యక్షులుగా వెలగా జగదీష్(సాక్షి) ఉపాధ్య క్షులుగా మల్ల కుమార్ (విశాలాంధ్ర), ప్రధాన కార్యదర్శిగా కర్రి భాస్కరరావు (గ్రేటర్ న్యూస్), కార్యవర్గ సభ్యులుగా పెంటకోట సత్యనారాయణ (పెంటకోట పవర్), కోరుబిల్లి బుజ్జి (ఆంధ్ర వాయిస్), పీలా శ్రీనివాస్ (ప్రజా జ్యోతి) పాల్గొన్నారు.

మన దేవాలయం మన హక్కు

విశాలాంధ్ర - పెందుర్తి : బీజేపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మన దేవాలయం మన హక్కు కార్యక్రమం ఆ పార్టీ పెందుర్తి నియోజకవర్గం కన్వీనర్ గొర్లె రామునాయుడు ఆధ్వర్యంలో బుధవారం ఉత్సాహంగా సాగింది. ఉత్తరాంధ్ర శబరిమల అయ్యప్ప స్వామి ఆలయంలో జరిగిన కార్యక్రమానికి స్థానికుల నుండి మంచి స్పందన లభించింది. అనేకమంది పండితులు, విద్యార్థులు, ఉద్యోగులు స్వచ్ఛందంగా పాల్గొని వైసీపీ ప్రభుత్వం చర్యలకు వ్యతిరేకంగా సంతకాలు చేశారు. ఈ సందర్భంగా రామునాయుడు మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానానికి సంబంధించి అన్యమతస్తులు, నేరస్తులు, జైలు పక్షులను బోర్డు మెంబర్లుగా నియమించడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి యర్ర అచ్చెన్నాయుడు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శిథిలావస్థలో తహశీల్దార్ కార్యాలయం

విశాలాంధ్ర - హుకుంపేట: హుకుంపేట మండల కేంద్రంలో తహశీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరడంతో సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. మండలంలో 33 పంచాయతీల్లో భూ సమస్యలు, పత్రాల కోసం ప్రజలు కార్యాలయానికి వస్తుంటారు. ఏ క్షణంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని అక్కడ సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరిందని గుర్తించి గతంలో రూ. 75 లక్షలతో నూతన భవనం నిర్మించి రెండేళ్లు గడు స్తున్నా తలుపులు, కిటికీలు ఏర్పాటు చేయకపోవటంతో భవనం మూలకు చేరి తుప్పలు మొలిచాయి. రెండేళ్లగా నిరుపయోగంగా ఉంది. ప్రభుత్వం నిర్వహించిన జగనన్న సురక్ష మండలంలో చివరి రోజు స్థానిక సచివాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే తహశీల్దార్ కార్యాలయంలో మిగిలిన పనుల నిమిత్తం 20 లక్షల రూపాయలు మంజూరు చేస్తున్నామని ప్రకటించారు. అయినా ఇప్పటివరకు ఎటువంటి పనులు ప్రారంభం కాలేదు. గత రెండేళ్ల క్రిందట నూతన భవనం నిర్మించి దానిని తహశీల్దార్ కార్యాలయానికి అప్పగించి పాత భవనాన్ని ఇతర కార్యాలయాల నిర్వహణకు కేటాయించారు. అల్లూరి జిల్లా ఏర్పాటు చేశాక తహశీల్దార్ పాత భవనం ఆర్టీవో కార్యాలయం ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయం తీసుకొన్నారు. తహసీల్దార్ నూతన భవనం నిర్మాణం పూర్తికాకపోవటంతో పాత భవనంలోనే విధులు నిర్వహిస్తున్నారు. ఉన్నత స్థాయి అధికారుల్లో ఎటువంటి స్పందన లేకపోవటంతో గతంలో పని చేసిన తహశీల్దార్లు భవనం కారిపోకుండా మరమ్మతులు నిర్వహించి సున్నాలు వేయించి వినియోగించుకొన్నారు. ప్రస్తుతం వర్షం పడుతుండడంతో బిల్డింగ్ ముందునే గుమ్మం దగ్గర నీళ్లు నిండిపోయి ఊట గెడ్డలా తలపిస్తోంది.

కూల్చివేసే భవనంలో ఆర్టీవో కార్యాలయం

పురాతన భవనం పైకప్పు నుంచి పెచ్చులూడి పడుతున్నా ఆర్టీవో అధికారులు బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. గతంలో ఈ భవనంలో భారీ అగ్ని ప్రమాదం జరిగి పూర్తిగా మరమ్మతులకు గురైంది. దీంతో భవనం కూల్చివేయాలని అప్పటి అధికారులు నిర్ణయం తీసుకొని వదిలేశారు. నేడు అదే భవనానికి సున్నం వేసి ఆర్టీవో కార్యాలయానికి అప్పగించటంతో అందులోనే విధులు నిర్వహిస్తున్నారు. వర్షం పడితే కారిపోవటం, ఉరుములు, మెరుపులకు భవనం నుంచి పెచ్చులు ఊడి పడుతున్నాయి. సిబ్బందికి విధులు నిర్వహించ దంలో చాలా ఇబ్బందిగా ఉంది. ఏ సమయంలో ఏ ప్రమాదం పొంచి వస్తుందోనని భయాందోళనలో సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు.

నూతన భవనం త్వరగా అప్పగించాలి

తహశీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరటంతో విధులు నిర్వహించాలంటే చాలా ఇబ్బంది ఉంది. నూతన భవనం నిర్మించినా ఫలితం లేదు. కిటికీలు, తలుపులు ఏర్పాటు చేయకపోవటంతో దానిలో విధులు నిర్వహించలేని పరిస్థితులు ఉన్నాయి. దీనిపై అధికారులు దృష్టికి తీసుకెళ్లాము. త్వరగా పనులు పూర్తి చేసి అప్పగించాలని కోరుతున్నాము. వర్షం పెద్ద పెద్ద ఉరుములు వచ్చినప్పుడు భవనంలో ఉండాలంటే భయంగా ఉంది.

-రాజ్యలక్ష్మి, తహశీల్దార్

మాడుగుల నియోజకవర్గ అభివృద్ధికి కృషి

టీడీపీ నేత పైలా ప్రసాదరావు

విశాలాంధ్ర - కె.కోటపాడు: మాడుగుల నియోజకవర్గ అభివృద్ధి ధ్యేయంగా నిరంతరం పనిచేస్తానని మాడుగుల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు పైలా ప్రసాదరావు అన్నారు. బుధవారం మండల కేంద్రం కే.కోటపాడులో మాడుగుల నియోజకవర్గ తెలుగుదేశం నాయకులు, అభిమానుల సమక్షంలో పైలా ప్రసాదరావు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. వివిధ గ్రామాల నుంచి నేతలు, కార్యకర్తలు పుష్పగుచ్చాలతో పైలాకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పైలా ప్రసాదరావు మాట్లాడుతూ గత పదిహేనేళ్ళుగా తనను ఆదరిస్తున్న మాడుగుల ప్రజలు, తెలుగుదేశం క్యాడర తనను ఓ కుటుంబ సభ్యుని మాదిరిగా ఆదరిస్తూ చూపిస్తున్న ఆత్మీయత మరువలేనిదన్నారు. మాడుగుల నియోజకవర్గ టిడిపి ఇంచార్జి పివిజి కుమార్ పైలాకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కే.కోటపాడు ప్రభుత్వ ఆసుపత్రిలో ఇంచార్జి పివిజి కుమార్ తో కలిసి పైలా రోగులకు పండ్లు, రొట్టెలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వందలాది మందికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కే.కోటపాడు మండల టిడిపి అధ్యక్షుడు రొంగలి మహేష్, కార్యదర్శి కన్నూరి నాగరాజు, క్లస్టర్ ఇన్ చార్జి కన్నూరి సూరిబాబు, లెక్కల మల్లేశ్వరరావు, బండారు నరసింహ నాయుడు,లెక్కల అవతారమూర్తి, వేచలపు సింహాద్రప్పుడు, వెలగల పైడం నాయుడు, పూడి నారాయణమూర్తి, బొడ్డు అక్కునాయుడు, మాడుగుల మాజీ ఎంపిపి పుప్పాల అప్పలరాజు, పార్టీ అధ్యక్షుడు అద్దేపల్లి జగ్గారావు, పార్టీ కార్యదర్శి ఉండూరు దేముడు, చీడికాడ మండల మాజీ ఎంపిపి కుచ్చు కళావతి, జిల్లా టిడిపి అధికార ప్రతినిధి రెడ్డి సన్యాసి నాయుడు, దేవరాపల్లి మండల క్లస్టర్ ఇన్ చార్జి దొగ్గ దేముడు నాయుడు, గుల్లిపల్లి అర్జునరావు కొమర బాబురావు,పెద్దాడ వెంకటరమణ,కర్రి నాయుడు గర్రెడ్డి కొండలరావు పాల్గొన్నారు.

దేవవరపు లోవరాజు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఉచిత కాశీ ప్రయాణం

విశాలాంధ్ర - పాయకరావుపేట: దేవవరపు లోవరాజు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మండలంలోని పాల్తేరు, శివారు అంకంపేట గ్రామాలకు చెందిన 50 మంది చేత ఉచితంగా కాశీ ప్రయాణం చేయిస్తున్నట్లు ట్రస్ట్ నిర్వహకులు, హైకోర్టు న్యాయవాది దేవవరపు రాంబాబు, ఆయన సోదరులు తెలిపారు. ఇప్పటికే ట్రస్ట్ ద్వారా పలు ఆధ్యాత్మిక, సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా పాల్తేరు, శివారు అంకంపేట గ్రామాలకు చెందిన 50 మందిని పాల్తేరు నుండి విశాఖపట్నం వరకు బస్సు, విశాఖపట్నం నుంచి కాశీ వరకు రైలు మార్గం ద్వారా ఉచితంగా కాశీ యాత్ర చేయించుటకు అంకురార్పణ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కుమ్మరిలోవ తపోవనం పీఠాధిపతి శ్రీ సచ్చిదానంద సరస్వతి స్వామీజీ హాజరయ్యారు. రామాలయంలో స్వామీజీ విశేష పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవవరపు వెంకటేశ్వరరావు, విశ్వనాధుని బద్రీనారాయణ, కొమ్మిరెడ్డి సత్తిబాబు, గోనెల సత్తిబాబు, దేవవరపు బుజ్జి, గొల్లపల్లి సత్తిబాబు, విశ్వనాధుని వెంకటేశ్వరరావు, దేవవరపు రాంబాబు, కొంకిపూడి రాజబాబు, కొంకిపూడి మూలయ్య, సుంకర రమణా రావు, దేవవరపు కన్నారావు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ వాసులకు పన్ను పోట్లు... విహార యాత్రలలో కార్పొరేటర్లకు సూట్లు...

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: కార్పొరేటర్ల అధ్యయన యాత్ర పేరుతో జరగనున్న విహారయాత్రను 22వ వార్డు జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ బహిష్కరించారు. ఈ మేరకు ఆయన బుధవారం మేయర్ గొలగాని హరి వెంకట కుమారిని కలిసి యాత్ర ఖర్చుతో నగరంలోని పలు వార్డుల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని వినతి పత్రం అందించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ జీవీఎంసీ కార్పొరేటర్లకు కోట్ల రూపాయల ఖర్చుతో అమృత్సర్, శ్రీనగర్ వంటి ప్రాంతాలకు అధ్యయన యాత్రకు తీసుకొని వెళ్లడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు తెలిపారు. నిజంగా అధ్యయనం చేయాలంటే ముంబై, సూరత్, ఢిల్లీ వంటి నగరపాలక సంస్థలకు వెళ్లాలని, అలా కాకుండా ప్రతి సారి హిమాచల్, అమృత్సర్, శ్రీనగర్ వంటి పర్యటన రాష్ట్రాలకే వెళ్తున్నారంటే అది కేవలం విహారయాత్రే అని చెప్పారు. నగర ప్రజల నుంచి ముక్కుపిండి చెత్త పన్ను వసూలు చేస్తున్న మనకు ప్రజాధనంతో విహారయాత్రలు చేసే హక్కు అధికారం లేదని చెప్పినట్టు తెలిపారు. వాస్తవాలను దృష్టిలో ఉంచుకొని యాత్రను రద్దు చేయాల్సిందిగా విజ్ఞప్తి చేసినట్టు ఆయన వెల్లడించారు.

ఇస్కాన్ నుంచి ఇంటిగ్రేటెడ్ ఇ-లైబ్రరీ ట్రాన్సెండ్

విశాలాంధ్ర - విశాఖ సిటీ: మానసిక వికాసానికి, ఆధ్యాత్మిక మేల్కొలుపు కోసం పుస్తకాలు ఒక అనివార్య మాధ్యమం. ఇస్కాన్ యొక్క పబ్లిషింగ్ విభాగం భక్తివేదాంత బుక్ ట్రస్ట్ ఈ రోజు వారి వినూత్న యాప్ "ట్రాన్సెండ్" ని విడుదల చేసింది., ఇది ప్రపంచంలోనే ఆడియో మరియు ఇ-బుక్స్ రెండింటినీ ఒకే చోట అందించే మొట్ట మొదటి ఇ-లైబ్రరీ యాప్. ఆడియోబుక్‌ల అభిమాని అయినా లేదా ఈ-బుక్స్ చదవడానికి ఇష్టపడినా, ట్రాన్సెండ్ మిమ్మల్ని ఆకట్టుకుంటుంది.

శ్రీల ప్రభుపాద పుస్తకాలలోని 2.7 లక్షల పేజీలకు పైగా విస్తరించి ఉన్న మొత్తం 5.6 కోట్ల పదాలు 8000 కి పైగా గంటల ఆడియో మరియు 600 ఫ్లస్ ఇ-బుక్స్‌లుగా మార్చబడ్డాయి. ఈ యాప్ ఆండ్రాయిడ్ మరియు ఐ ఓఎస్ ప్లాట్‌ఫారమ్‌లలో , వెబ్ యాప్‌లో కూడా అందుబాటులో ఉంది.

ఆదివాసీలను కక్షతో కాదు కరుణతో చూడండి

విశాలాంధ్ర - సీలేరు: ఆదివాసీలను కక్షతో కాదు కరుణతో చూడండని ఆంధ్రప్రదేశ్ ఆదివాసి జెఏసి రాష్ట్ర వైస్ చైర్మన్ మొట్టడం రాజబాబు, రాష్ట్ర కార్యదర్శి సొనాయి గంగరాజు, జిల్లా కన్వీనర్ రామరావుదొర జిల్లా కలెక్టర్, ఐటిడిఏ పిఓలకు సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జిల్లా పూర్తిగా ఆదివాసీల జిల్లా, ఐటిడిఏ పూర్తిగా ఆదివాసుల కోసం ఏర్పడిన సంస్థ అని, ఈ రెండింటిపై పూర్తి అధికారంతో పాటు బాధ్యత కలిగిన కలెక్టర్, పిఓ ఆదివాసీల పట్ల వివక్షతో వ్యవహరిస్తున్నారన్నారు. చరిత్రలో మీలాంటి ఐఏఎస్ అధికారులైన బిడి శర్మ, ఎస్ఆర్. శంకరన్, ఇఎఎస్. శర్మ లు ఆదివాసీల పట్ల జాలి, దయ, కరుణతో తమ జీవితాలు త్యాగం చేసారన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాకు మొదటి కలెక్టర్ సుమిత్‌కుమార్ జిల్లాకలెక్టర్‌లాగా కాకుండా ఐటిడిఏ పిఓలాగా వ్యవహరిస్తూ, పిఓ అధికారాలను తాను లాక్కొని ఆదివాసీల పట్ల కక్ష పూరితంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఆదివాసీలకు రాజ్యాంగ పరంగా సక్రమించిన హక్కులు, చట్టాలను కాలరాస్తున్నారని చెప్పారు. రాజకీయ నాయకుల్లాగా వ్యహరించకుండా, ఐఎఎస్ అంటే ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ అయినప్పటికి ఇంటిగ్రేటెడ్ ఆదివాసి సర్వీస్ లాగా భావించి పనిచేయాలని వారు హితవు పలికారు.

ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ధన్యురాలు

విశాలాంధ్ర - చింతపల్లి: గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా కొయ్యూరు మండలం బూదరాళ్ల గ్రామంలో నేడు 200 రోజులు పూర్తి చేసుకుంటున్న పాడేరు శాసనసభ్యులు కొట్టగుళ్ళి భాగ్యలక్ష్మి ధన్యురాలని ఆ పార్టీ చింతపల్లి మండల అధ్యక్షుడు మోరి రవి అన్నారు. పాడేరు నియోజకవర్గంలో ఆ పార్టీ అల్లూరి జిల్లా అధ్యక్షురాలు, పాడేరు శాసనసభ్యురాలు కొట్టగుళ్ళి భాగ్యలక్ష్మి గడప-గడపకూ చేపట్టి నేటికీ 200 వందల రోజులు పూర్తి చేసుకుంటున్న శుభ సందర్భాన్ని పురస్కరించుకొని కొయ్యూరు మండలం బూదరాళ్ల గ్రామంలో గురువారం పాడేరు శాసన సభ్యురాలు కొట్లగుళ్ళి భాగ్యలక్ష్మికి చింతపల్లి మండలం నుండి ఎంపీపీ అనూష దేవి, జడ్పిటిసి సభ్యుడు పోతురాజు బాలయ్య, వైస్ ఎంపీపీలు గోపీనాయక శారద, సాగిన వెంగళరావు, మండల కో ఆప్షన్ సభ్యుడు షేక్ నాజర్ వల్లి, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ మీరాలు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు.

సేవా నిరతిని చాటుకున్న సుజాత సల్మాన్

విశాలాంధ్ర - దుంబ్రిగూడ: మండలంలోని సాయి నగర్ గ్రామంలో గల 30 పీవీటీజీ కుటుంబాలకు బుధవారం ఉచితంగా ఐదు కేజీల చొప్పున బియ్యం పంపిణీ చేసి ఆమ్ ఆద్మీ పార్టీ అల్లూరి జిల్లా ఇన్చార్జి మొస్య. సుజాత సల్మాన్ సేవా భావాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అరకు నియోజకవర్గం పరిధిలో ఉన్న ఆరు మండలాల్లో మారుమూల గ్రామాల్లో పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. క్షేత్రస్థాయిలో అభివృద్ధి చేస్తున్నామని వైసిపి ప్రభుత్వం పత్రిక ప్రకటనలకే పరిమితం తప్ప అభివృద్ధి చేసిన దాఖలాలు లేవని ఆమె విమర్శించారు. వైసిపి ప్రభుత్వం ఏర్పడి ఐదేళ్లు కావస్తున్న ఇప్పటికీ పలు గ్రామాల్లో తాగునీటి, డ్రైనేజీ కాలువలు, సిసి రోడ్లు ఏర్పాటు చేసిన దాఖలాలు లేవని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరు

విశాలాంధ్ర - హుకుంపేట: ప్రభుత్వం రహదారి సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేసిందని పంచాయితీరాజ్ ఏఈ శెట్టి సంజీవరావు తెలిపారు. బుధవారం తమ కార్యాలయం వద్ద స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని తడిగిరి పంచాయతీ రోడ్డు కామయ్యపేట రోడ్డు జంక్షన్ నుంచి తడిగిరి వరకు 99 లక్షల 90 వేలు, తడిగిరి జంక్షన్ నుంచి కామయ్యపేట గరడపల్లి వరకు పార్టీ హోల్ ప్రీరోడ్లు నిధులు 1కోటి 18లక్షల 40వేలు, కుంతుర్ల నుంచి రింగ్ రోడ్డు సార్లం ముల్లుమెట్ట ఆమోరు మీదుగా తడిగిరి పంచాయితీ బొడ్డ పట్టు గ్రామం వరకు 1, కోటి 40 లక్షలు మంజూరైనట్టు తెలిపారు. ఈ పనులన్నీ ఇప్పటికే మొదలైపోయాయని తెలిపారు.

గర్భిణీల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

విశాలాంధ్ర - మాకవరపాలెం: గర్భిణీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మాకవరపాలెం వైద్యాధికారి డాక్టర్ సీతారామలక్ష్మి సూచించారు. బుధవారం మాకవరపాలెం పీహెచ్‌సీలో వైద్యశాఖ నూతనంగా తీసుకువచ్చిన కిల్ కారీ యాప్ వినియోగంపై ఆశ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. ఈ యాప్‌లో గర్భిణీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వారి ఆరోగ్య భద్రత, తదితర అంశాలపై వివరాలు పొందుపరిచి ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై సీపీఎం సంతకాల సేకరణ

విశాలాంధ్ర - అరకులోయ: కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జీవో నెంబర్ 3, నిరుద్యోగం, అధిక ధరలు పెంపుదలకు వ్యతిరేకంగా సిపిఎం పార్టీ సంతకాల సేకరణ అరకులోయ మండల కేంద్రంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో చేపట్టారు.

కేంద్రంలో మతోన్మాద మోడీ ప్రభుత్వం నిరుద్యోగ సమస్య పరిష్కరించడంలో, ధరలు అదుపు చేయడంలో ఘోరంగా విఫలమైందని, కార్పొరేటర్లకు ఆదాని, అంబానీలైన బడా పెట్టుబడిదారులకు లక్షల కోట్ల రూపాయలు రాయితీలు ఇస్తూ పేదలపై తీవ్రమైన భారం మోపుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు అమలు చేయకపోతే రాష్ట్రాలకు అప్పులు ఇవ్వడం కుదరదని బెదిరిస్తుండం రాష్ట్రంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం కేంద్ర విధానాలకు అనుగుణంగా అతి ఉత్సవంతో విద్యుత్ చార్జీలు విపరీతంగా పెంచే యోచన చేస్తూ నిత్యవసర సరుకుల అధిక ధరలు పెంచుతూ పేద ప్రజలపై తీవ్రమైన భారం మోపుతుందని అన్నారు. అంతేకాకుండా జీవో నెంబర్ 3 పునరుద్ధరణ చేయాలని, స్పెషల్ డిఎస్సి నోటిఫికేషన్ జారీ చేసి ఆదివాసుల ఉద్యోగ ఉపాధ్యాయ నియామకం ప్రమోషన్లు స్థానిక ఆదివాసి యువతకు 100% రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ చార్జీలు విపరీతంగా పెంచి బడా కార్పొరేట్ శక్తులకు రాయితీలు కట్టబెడుతూ సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామన్న మోడీ ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేట్ సంస్థలు కట్ట బెట్టి ఉద్యోగం ఉపాధి లేకుండా యువతకు మోసం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు, సిపిఎం పార్టీ మండల కార్యదర్శి కిం డంగి. రామారావు సిపిఎం పార్టీ నాయకులు సత్యారావు, మహాదేవ్, సహదేవ్,జొయో, గోపాల్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలో మార్పులపై ప్రత్యేక దృష్టి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ఓటర్ల జాబితాలోని మార్పులు చేర్పులు చేయటానికి అధికారులు ప్రత్యేక దృష్టితో ఇంటింటి సర్వే పూర్తి చేయటం జరిగిందని జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాస మూర్తి అన్నారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్ఓ మాట్లాడుతూ ఎలక్షన్ కమీషన్ ఆదేశాల మేరకు ప్రతివారం వివిధ రాజకీయ పార్టీల ప్రతి నిధులతో సమావేశం ఏర్పాటులో భాగంగా సమావేశం నిర్వహించడం జరిగిందన్నారు. రాజకీయ పార్టీల ప్రతి నిధుల దృష్టికి వచ్చిన సమస్యలు తెలియజేస్తే వాటిని పరిశీలించి పరిష్కరించడం జరుగుతుందన్నారు. 5-1-2023 నుండి 29-8-2023 నాటికి చేర్పులు 50128, తొలగింపులు 50185, మార్పులు 20952 జరిగాయని తెలియజేసారు. ప్రతి వారం ఓటర్ జాబితాలో చేర్పులు,తొలగింపులు, మార్పుల సమాచారాన్ని

రాజకీయ పార్టీ ప్రతినిధులకు అందజేయడంతో పాటు బియల్ఓ యాప్ నందు నమోదు చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో కృష్ణకాంత్ (వైసీపీ), కె.గోపాల్ రెడ్డి(టిడిపి), లక్ష్మీ నారాయణ (బిజెపి), కె.యమ్ రాజు(ఆమ్ ఆద్మీ), బోణు కృష్ణ(బిఎస్పి), ఎన్నికల సెక్షన్ సూపరింటెండెంట్ సిహెచ్.వి రమేష్ పాల్గొన్నారు.

టాటా క్విజ్ ఏపీ క్లస్టర్ విజేతగా అక్షయ్ వల్లే

విశాలాంధ్ర - విశాఖ సిటీ: భారతదేశపు అత్యంత ప్రతిష్టాత్మకమైన బిజినెస్ క్విజ్ టాటా క్రూసిబుల్ క్యాంపస్ క్విజ్ 2023 యొక్క క్లస్టర్ 1 ఫైనల్స్‌లో విశాఖపట్నంలోని సమతా కాలేజీకి చెందిన అక్షయ్ వల్లే విజేతగా నిలిచారు. ఆంధ్రప్రదేశ్ ప్రాంతానికి ప్రాతినిధ్యం వహిస్తూ క్లస్టర్ 1 ఫైనల్స్‌లో పాల్గొన్న వారందరి నుండి పవర్ ప్యాక్ చేసిన ప్రదర్శన ఈ పోటీలు చూశాయి. విజేత రూ. 35,000, నగదు బహుమతి తో పాటు జోనల్ ఫైనల్స్‌లో స్థానం సంపాదించాడు. ఆంధ్రప్రదేశ్‌లోని కొవ్వాడలోని విష్ణు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కి చెందిన ప్రియగార్లపాటి రన్నరప్‌గా ప్రకటించబడింది. ఆమె రూ. 18,000 నగదు బహుమతిని గెలుచుకుంది. ఈ సంవత్సరం క్యాంపస్ క్విజ్ కోసం, దేశం 24 క్లస్టర్‌లుగా విభజించబడింది. ఆన్‌లైన్ ప్రిలిమ్స్ యొక్క రెండు స్థాయిల తర్వాత, ప్రతి క్లస్టర్ నుండి టాప్ 12 ఫైనలిస్టులు వైల్డ్ కార్డ్ ఫైనల్స్‌కు షార్ట్‌లిస్ట్ చేయబడ్డారు.వీరిలో టాప్ 6 ఫైనలిస్టులు 24 ఆన్‌లైన్ క్లస్టర్ ఫైనల్స్ లో పోటీపడతారు. ఈ 24 క్లస్టర్‌లు దక్షిణం, తూర్పు, పశ్చిమం మరియు ఉత్తరం అంటూ నాలుగు జోన్‌లుగా విభజించబడ్డాయి. జోనల్ ఫైనల్స్ కూడా ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నారు. నేషనల్ ఫైనల్స్ ఆఫ్ లైన్ కార్యక్రమంగా జరగనుంది. నేషనల్ ఫైనల్స్‌లో 8 మంది ఫైనలిస్టులు పాల్గొంటారు, వీరు జాతీయ ఛాంపియన్ టైటిల్ కోసం పోటీ పడనున్నారు. విజేతలు రూ.2.5 లక్షలు ప్రతిష్టాత్మకమైన టాటా క్రూసిబుల్ ట్రోఫీ అందుకుంటారు.

రహదారులు, వంతెనల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయండి

విశాలాంధ్ర - చింతపల్లి: రహదారులు వంతెనల నిర్మాణాలకు విరివిగా నిధులు మంజూరు చేసి మారుమూల గ్రామాల గిరిజనులు ప్రాణాలు కోల్పోకుండా చూడాలని కుడుము సారి పంచాయతీ వార్డు సభ్యుడు బోండా సింహాచలం అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ తమ పంచాయతీ పరిధిలో అనేక గ్రామాల ప్రజలు రహదారులు, వంతెనలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ క్రమంలో అనేకమంది వివిధ కారణాలతో సకాలంలో ఆసుపత్రులకు చేరుకోలేక ప్రాణాలు కోల్పోయిన సందర్భాలు ఎన్నో ఉన్నాయన్నారు. సరైన రహదారులు లేక ప్రమాదాలు చోటు చేసుకుని కొందరు, అనారోగ్యాలతో మరికొందరు, ప్రసవాల కోసం సకాలంలో ఆసుపత్రులకు వెళ్లే వీలు లేక గర్భిణీలు ఇలా వివిధ కారణాలతో విగత జీవులైన వారు ఎంతోమందన్నారు. ఈ మధ్యకాలంలో కుమారుడు మృతితో మనస్థాపానికి గురైన మహిళ పురుగుల మందు తాగి తనువు చాలించిన ఘటన పంచాయతీ పరిధిలోని కరకపల్లి గ్రామంలో చోటుచేసుకుందన్నారు. ఇటువంటి ఎన్నో సమస్యలతో తమ పంచాయతీలోని గిరి గ్రామాల ప్రజలు సతమతం అవుతున్నారన్నారు.

గ్రామపంచాయతీ పరిధిలోని రహదారులు, వంతెనలు లేక ఇబ్బంది పడుతున్న గిరి గ్రామాలకు రహదారుల కల్పన, వంతెనల ఏర్పాటు నిమిత్తమై విరివిగా నిధులు మంజూరు చేయాలని అన్నారు.

నాటుసారా స్థావరాలపై పోలీసులు ఉక్కుపాదం

విశాలాంధ్ర - కొయ్యూరు: నాటుసారా స్థావరాలపై కొయ్యూరు పోలీసులు మెరుపు దాడులు నిర్వహించి 3200 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేశారు. ఈ మేరకు కొయ్యూరు ఎస్ఐ రాజారావు అందజేసిన వివరాల ప్రకారం తమకు అందిన ముందస్తు సమాచారంతో మండలంలోని పోతవరం గ్రామ శివారులో నాటుసారా స్థావరాలపై తమ సిబ్బంది ఏపీఎస్పీ పోలీసులతో కలిసి దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో నాటుసారా తయారికి సిద్ధంగా ఉంచిన 3200 లీటర్ల బెల్లం పులుపుతో పాటు తయారీకి వినియోగించే వంట సామాగ్రి నిల్వఉంచే డ్రమ్ములు తయారు చేసే బట్టీలను ధ్వంసం చేసినట్లు చెప్పారు. ఆడాకుల గ్రామానికి చెందిన ఉల్లి సుమన్ అతని భార్య కొండమ్మ లు నాటుసారా తయారు చేస్తున్నట్లు గుర్తించామని ప్రస్తుతం వారు పరారీ లో ఉన్నందున త్వరలోనే అరెస్టు చేస్తామని ఎస్ఐ తెలిపారు. జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేర ఆపరేషన్ పరివర్తన కార్యక్రమంలో భాగంగా నాటుసారా తయారీ క్రయవిక్రయాలను సమూలంగా నిర్మూలించే విధంగా కృషి చేస్తున్నట్లు ఎస్ఐ రాజారావు తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు ఎవరు పాల్పడిన ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

తారకరామ రిజర్వాయర్ తాచేరు డ్యాంను
తక్షణమే పూర్తి చేయాలి

విశాలాంధ్ర - వి. మాడుగుల: అసంపూర్తిగా ఉన్న తారకరామ తాచేరు తాచేరు డ్యాంను పూర్తి చేయాలని మాడుగుల మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు చేస్తున్న పాదయాత్ర బుధవారం రెండో రోజు కూడా కొనసాగింది. ఘాట్ రోడ్ జంక్షన్ నుంచి వయా సాగరం పంచాయతీ మీదుగా మాడుగుల టౌన్ వరకు చేరి అక్కడ బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా రామానాయుడు మాట్లాడుతూ తారకరామా తాచేరు డ్యాం తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయంలో 8 కోట్ల 35 లక్షల రూపాయలు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఇప్పుడున్న ప్రభుత్వం కనీసం ఈ ప్రాజెక్టు పూర్తి చేసే పరిస్థితి లేదన్నారు. రైతులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని, ఈ ప్రాజెక్టు 14 గ్రామాలకు నీరు అందుతుందన్నారు. ఈ చేతకాని ప్రభుత్వం, చేతకాని మంత్రి హయాంలో ఈ నాలుగు సంవత్సరాలలో కనీసం అభివృద్ధి అనేది మాడుగుల నియోజకవర్గం చేసిన పాపాన లేదని ఆరోపించారు. రిజర్వాయర్ పరిధిలో 3502 ఎకరాలకు సాగునీరు అందక ప్రతీ ఏటా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.

వ్యవసాయ ప్రాంతమైన మాడుగుల నియోజకవర్గంలో పలు రిజర్వాయర్లు నేటికీ పూర్తి కాలేదని, ఉపముఖ్యమంత్రి వీటిపై దృష్టిసారించడం లేదని ఆరోపించారు. తక్షణమే ఈ రిజర్వాయర్‌కు పూర్తి మరమ్మత్తులు చేపట్టి కాలువ ద్వారా సాగునీటిని అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

దేవాలయాలకు, మార్కెట్ కమిటీకి సభ్యుల నియామకం

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: ఎట్టకేలకు, ఎన్నికలు సమీపిస్తున్న వేళ అసంతృప్తిగా ఉన్న క్రింద స్థాయి నాయకులను సంతృప్తి పరిచే పనిలో భాగంగా కొన్ని దేవాలయాలకు, మార్కెట్ కమిటీకి నూతన సభ్యులను నియమించింది. ఆ సభ్యుల వివరాలను మంత్రి అమర్నాథ్ తన క్యాంపు కార్యాలయంలో బుధవారం ప్రకటించారు. ఉత్తరాంధ్రలోనే ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన శ్రీ నూకాంబిక అమ్మవారి ఆలయ కమిటీ చైర్మన్‌గా గవరపాలెం ప్రాంతానికి చెందిన కొణతాల మురళీకృష్ణను నియమించారు. సభ్యులుగా కంటపల్లి శోభారాణి, పీలా లక్ష్మి, పాము అనూరాధ, మల్లవరపు ఈశ్వరరావు, ఆడారి ఉమా చంద్ర మహేశ్వరి, బుద్ధ నరసింగరావు, గొల్లవిల్లి నరసింగరావు, కొండూరు రవీంద్రనాథ్, ఎక్స్ అఫీషియో మెంబర్‌గా వై.శ్రీనివాసరావులను నియమించారు. అలాగే దేశంలోనే ప్రసిద్ధిగాంచిన అనకాపల్లి బెల్లం మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కశింకోటకు చెందిన గొల్లవిల్లి శ్రీనివాసరావును నియమిస్తున్నట్లు ప్రకటించారు. ఈయన మొన్నటి వరకు వైసిపి కసింకోట మండల పార్టీ అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహించారు. మరికొన్ని దేవస్థానాలకు కమిటీలను నియమించారు. వాటిలో భోగలింగేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్‌గా ఆళ్ల నాగేశ్వరరావు, సభ్యులుగా సింగంపల్లి రాజేశ్వరి, కొణతాల అప్పాజీ, మెలిపాక దుర్గ, కాండ్రేగుల రాము, కొనతాల కృష్ణంరాజు, వాసుపల్లి తాతయ్యలు, ఎక్స్ అఫీషియో మెంబెర్‌గా టి.నారాయణరావులను నియమించారు. సుంకరమెట్ట సత్యనారాయణ స్వామి దేవస్థానం చైర్మన్‌గా కే.ఎం.నాయుడును, సభ్యులుగా నేతల చంద్రకళ, పెంటకోట అప్పలనాయుడు, తగరంపూడి నరసింగరావు, మారిశెట్టి శ్రీనివాసరావు, తాడి నాగలక్ష్మి, విజ్జపు ముకుంద, ఎక్స్ అఫీషియల్ మెంబర్గా ఎం విద్యాసాగర్ నియమితులయ్యారు. దేవుని గుమ్మం వెంకటేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్‌గా సకలా రాజ్యలక్ష్మి గోవిందరావు, సభ్యులుగా ఉమ్మిని పైడిరాజు, సుంకర వెంకట్రావు, సూరిశెట్టి చిన్నసన్యాసిరావు, శ్రీధరాల కోమలి,రాజనలక్ష్మి, లింగం అనురాధఎక్స్ అఫీషియో మెంబర్‌గా పి.గిరిబాబు నియమితులయ్యారు. సిద్ధి లింగేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ గా నుదురుపాటి తాతాజీ, సభ్యులుగా కె.వి. త్రివేణి, ఈ.నూకరత్నం, నాగులపల్లి వీర్రాజు, నాగ బోగలింగస్వామి, కుందరపు లక్ష్మి, ఎం.వరమ్మ, ఎక్స్ అఫీషియో మెంబెర్ గా ఎస్ మల్లికార్జున రావు నియమితులయ్యారు. అదేవిధంగా వేల్పుల వీధిలోని కాశీ విశ్వేశ్వర స్వామి దేవాలయం ట్రస్ట్ బోర్డ్ సభ్యులుగా గదిరెడ్డి నూకరాజు, ఒడిశెట్టి కనకమహాలక్ష్మి, నిమ్మకాయల నాగమణి, కొడుకుల వి ఎస్ ఆర్ ఎస్ సుబ్రహ్మణ్యం, ద్రాక్షారపు లలిత, కొమ్మన శంకర్రావు, ఎక్స్ అఫీషియో మెంబర్‌గా డిఎస్ ప్రకాష్ రావు నియమితులయ్యారు. దీనికి వంశపారంపర్యంగా వస్తున్నవారు చైర్మన్‌గా వ్యవహరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, ఏపీ ఇన్ లాండ్ వాటర్ వేస్ అథారిటీ చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్, పట్టణ పార్టీ అధ్యక్షుడు మందపాటి జానకి రామరాజు, ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు డాక్టర్ జి రామ్మూర్తి, జీవీఎంసీ సచివాలయాల కన్వీనర్ కొణతాల మురళీకృష్ణ, అనకాపల్లి జిల్లా వైసీపీ ప్రధాన కార్యదర్శి సూరిశెట్టి రమణ అప్పారావు, కార్యదర్శి జాజుల రమేష్ పాల్గొన్నారు.

బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారంటీ

విశాలాంధ్ర - అరకులోయ: అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయ మండల కేంద్రంలో గల అక్షయ ఇన్ ప్రవేట్ రిసార్ట్‌లో తెలుగుదేశం పార్టీ ఇంచార్జి మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు శెట్టి బాబురావు ఆధ్వర్యంలో బాబు రిటీ-భవిష్యత్తు గ్యారంటీ సెప్టెంబర్ 1నుండి 45రోజులు చేపట్టబోయే క్లస్టర్, యూనిట్ బూత్ ఇంచార్జుల ట్రైనింగ్ కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలుగుదేశం పార్టీ అరకు అసెంబ్లీ పరిశీలకులు ఎమ్మెల్సీ దువ్వారాపు రామారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు మాట్లాడుతూ ప్రజల్లో బాబు ష్యూరిటి భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమంలో ప్రచారం చేయాలనీ దిశా నిర్దేశం చేసారు.వైసీపీ ప్రభుత్వం వైఫాల్యలను ప్రజల్లో ఇంటింటికి వెళ్ళి ప్రజలకు తెలియజేయాలన్నారు.అనంతరం మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ ఆరు మండలలో 45 రోజులు గడప గడపకు వెళ్ళి ప్రజల సమస్యలను తెలుసుకోవాలని రాబోయే ఎన్నికలో తెలుగుదేశం పార్టీ గెలుపే లక్ష్యంగా బూత్ యూనిట్ క్లస్టర్ ఇంచార్జులు పని చేయాలనీ ప్రతి గ్రామంలో ప్రతి ఒక్క ఓటర్ దగ్గర వెళ్లి ఓటర్ కు వైసీపీ ప్రభుత్వ అరాచకా పాలనను గ్రామంలో ప్రచారం చేయవలసిన బాధ్యత క్లస్టర్,బూత్ ఇన్చార్జిలు బాధ్యత తీసుకోవాలన్నారు. అదే విధంగా రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ పిలుపునిచ్చిన మహానాడు మినీ మేనిపెస్టో గ్రామలో ప్రచారం చేసి ప్రజల్లో మేనిపెస్టో గురించి అవగాహనా కల్పించాల్సిన బాధ్యత మండల నాయకులు బాధ్యత తీసుకోవాలని రాష్టంలో వైసీపీ ప్రభుత్వ అరాచకాలు వైసీపీ ప్రభుత్వం యొక్క వైఫాల్యలను ప్రజల్లో ప్రతి ఒక్కరికి తెలిజెయాలనీ జగన్ ప్రభుత్వం పాదయాత్రలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలం అయిందని రాబోయే ఎన్నికలో తెలుగుదేశం పార్టీ గెలుపే లక్ష్యంగా ఒక సైనికుల పని చేయాలనీ తెలుగుదేశం పార్టీ బలోపేతానికి గ్రామస్థాయిలో నాయకులు కార్యకర్తలు కృషి చేయాలనీ 2024 ఎన్నికలో తెలుగుదేశం పార్టీ గెలుపు లక్ష్యంగా పని చేసి నారా చంద్రబాబు నాయుడుని

ముఖ్యమంత్రి చేయడమే ప్రధాన లక్ష్యమని అరకు టీడీపీ ఇంచార్జి మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ నాయకులకు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకుడు పెదలబుడు మేజర్ పంచాయతీ సర్పంచ్ పెట్టేలి దాసుబాబు,మాజీ ఎస్సి ఎస్టీ కమిషన్ సభ్యులు సివేరి అబ్రహం, అరకు పార్లమెంట్ కోశాధికారి వంతల నాగేశ్వరరావు,అనంతగిరి మండల పార్టీ అధ్యక్షుడు బుజ్జి బాబు,దుంబ్రీ గూడ మండల అధ్యక్షుడు సుబ్బారావు,అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి బాకూరు వెంకటరమణ రాజు, రాష్ట్ర ఎస్టీ సెల్ ఆర్గనైజర్ సెక్రటరీ సాగర సుబ్బారావు,మాజీ వైస్ చైర్మన్ కొట్యాడ అప్పారావు,టీడీపీ మహిళా సీనియర్ నాయకులు బుర్ర లక్ష్మి,దారెలా సర్పంచ్ పాంగి పాండురంగ స్వామి,అరకు పార్లమెంట్ టిఎన్టీయుసి ప్రధాన కార్యదర్శి మండ్యగురు స్వామి,లీగల్ సెల్ అధ్యక్షుడు రత్నారాజు,రాష్ట్రతెలుగు యువత ఆర్గనైజేషన్ కార్యదర్శి సాయిరాం, యువ నాయకులు కిల్లో శ్యామ్,గుండన్న,టీడీపీ మహిళా నాయకులు సివేరి ఇచ్చావతి,ఎల్.బికళావతి,ద్రౌపతి, ఆరు మండలాల క్లస్టర్ యూనిట్ బూత్ ఇంచార్జులు టీడీపీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలను పీఓ తనిఖీ

విశాలాంధ్ర - చింతూరు: మండలంలోని బొడ్డుగూడెం, ఏడుగురాళ్లపల్లి ఆశ్రమ పాఠశాలలను ఐటీడీఏ పీవో సూరజ్ గనేరో బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల హాజరు పట్టికలు, విద్యార్థుల హాజరు పట్టికలు, స్టాక్ రిజిస్టర్లు పరిశీలించారు. మెనూ అమలు తీరును ఫుడ్ కమిటీ ద్వారా తెలుసుకున్నారు. మెను నిర్వహణ, ఉపాధ్యాయుల పనితీరు పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఏడుగురాళ్లపల్లి, లక్ష్మీపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను, ఫార్మసిస్ట్ ల్యాబ్‌లను తనిఖీ నిర్వహించారు.

ప్రభుత్వాల వ్యతిరేక విధానాలపై కరపత్రాలు పంపిణీ

విశాలాంధ్ర - వి.ఆర్.పురం: మండల పరిధిలోని గ్రామాలలో సిపిఎం పార్టీ బృందాలు పర్యటించి ప్రజలతో ముచ్చటించాయి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై కరపత్రాలను పంపిణీ చేశారు. సిపిఎం జిల్లా నాయకులు పూనెం సత్యనారాయణ మాట్లాడుతూ పోలవరం పేరుతో ముంపు మండలాలను నిండా ముంచేస్తున్నారని, 18 ఏళ్ళు నిండిన యువతీ యువకులకు చాలా అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సెప్టెంబర్ 1న జరిగేటటువంటి సచివాలయ కార్యాలయ ముట్టడి, సెప్టెంబర్ 4 మండల రెవెన్యూ కార్యాలయం ముట్టడికి ప్రజలంతా అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సోడి మల్లయ్య, మాజీ ఎంపీటీసీ సభ్యులు గుట్టల శ్రీను, నాల్లారపు ప్రకాష్ రావు, ముంజపు రామచంద్రం, ముత్యాల చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు రాఖీ కట్టిన పెదపాటి అమ్మాజీ

విశాలాంధ్ర - పాయకరావుపేట: ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి, ఎస్సీ (మాల) కార్పొరేషన్ చైర్మన్ పెదపాటి అమ్మాజీ రాఖీ పౌర్ణమి పురస్కరించుకొని రాఖీ కట్టారు. జగ్గంపేటలో పర్యటించిన ముఖ్యమంత్రిని కలిసి రాఖీ కట్టారు. పెదపాటి అమ్మాజీ కుమార్తె వివాహానికి గతంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాయకరావుపేట విచ్చేసిన విషయం అందరికి తెలిసిందే. అంతేకాక రానున్న ఎన్నికల దృష్టిలో పెట్టుకొని గత కొన్ని రోజులుగా పెదపాటి అమ్మాజీ పాయకరావుపేట నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. వైసీపీలోని ముఖ్యమైన నాయకులను కలుసుకొని పరిచయం చేసుకుంటున్నారు.

ప్రతి పల్లెకు రహదారి: ఎమ్మెల్యే

విశాలాంధ్ర - కొయ్యూరు: నియోజకవర్గంలోని ప్రతి పల్లెకు రహదారి నిర్మించాలన్నదే లక్ష్యమని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని చోద్యం సమీప బొడ్డేరు వాగు వద్ద నుండి కంఠారం పిహెచ్సి వరకు నాబార్డ్ నిధులు రెండు కోట్లతో నిర్మించిన 7.5 కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి ఎంపీపీ రమేష్, జడ్పీటిసి నూకరాజు, ఏఎంసి చైర్ పర్సన్ రాజులమ్మ, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ నాగమణి తదితర పలు నేతలతో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. రెండు కోట్ల నాబార్డ్ నిధులతో సుమారు 7.5 కిలోమీటర్ల మేర నిర్మించనున్న ఈ రహదారి నిర్మాణ పనులు పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ అధికారులు పర్యవేక్షణలో జరుగుతాయని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం కొమ్మిక పంచాయతీలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనం రైతు భరోసా కేంద్రాలను స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సీతయ్య, వైస్ ఎంపీపీ వెంకటరమణ, పార్టీ మండల అధ్యక్షుడు బాబులు, సర్పంచ్ కన్నయ్యమ్మ, ఉప సర్పంచ్ వనం బాబు, ట్రై కార్ డైరెక్టర్ లోవరాజు, ఏఎంసి డైరెక్టర్ అచ్యుత్, పలువురు ప్రజాప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్

విశాలాంధ్ర - చోడవరం: చోడవరం మండలంలోని జన్నవరం, పి.ఎస్.పేట గ్రామాల్లో గల పోలింగ్ కేంద్రాలను అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి పఠాన్ శెట్టి బుధవారం పరిశీలించారు. ఓటర్ నమోదు సర్వేపై సచివాలయ ఉద్యోగులను అడిగి తెలుసుకున్నారు. ఓటర్ నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట తహసీల్దార్ తిరుమల బాబు ఎన్నికల డి.టి. తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్ విభాగం జనరల్ జిల్లా సెక్రటరీగా రౌతు శ్రీను

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలం విద్యార్థి విభాగం అధ్యక్షులను గ్రీవెన్స్ విభాగం విశాఖ జిల్లా జనరల్ సెక్రెటరీగా రౌతు శ్రీను ను నియమిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా ముందుకు తీసుకెళ్లే విధంగాపార్టీ కోసం కృషిచేసి పార్టీ నిర్ణయాలు కట్టుబడి పనిచేస్తూ పార్టీ విధానాలకు అనుగుణంగా ఉన్నందుకు సంతోషంగా ఈ పదవి దక్కింది అని తెలిపారు అందుకు భీమిలి శాసన సభ్యులు ముత్తం శెట్టి శ్రీనివాసరావు కు, ఆనందపురం స్థానిక నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ముసలినాయుడుపాలెం మంచినీటి సమస్యకు పరిష్కారం

విశాలాంధ్ర - పెదగంట్యాడ: చాలా నెలలుగా 75వ వార్డులో ముసలినాయుడుపాలెం ప్రజలు మురుగు వాసనతో కూడిన మంచి నీరు సరఫరాతో ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్య తన దృష్టికి వచ్చిన వెంటనే స్థానిక కార్పొరేటర్ శ్రీమతి పులి లక్ష్మిబాయి వెంకట రమణా రెడ్డి అధికారులతో సమస్య పరిష్కారం కోసం చేయాల్సిన అన్ని ప్రయత్నాలు చేసినా దానికి కారణం కనుక్కోవడం లో అధికారులు పూర్తిగా విఫలం అయిన సందర్భములో , ఆ సమస్యను పై అధికారుల దృష్టికి తీసుకొని వెళ్ళి సమస్యకు పరిష్కారంగా కొత్త మంచినీటి పైపు లైన్ వెయ్యాలని పదే పదే అడుగుతుండడంతో దానికి ఒప్పుకొని కొత్త పైపు లైన్ వెయ్యడం జరిగింది. చాన్నాళ్ళుగా ఇబ్బంది పడుతున్న ఈ సమస్యను పట్టు వదలకుండా సాధించి పెట్టిన కార్పొరేటర్ పులి లక్ష్మిబాయి వెంకట రమణా రెడ్డికి ఈ సందర్భములో స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలియచేసారు.